వైభవంగా ఆలయ వార్షికోత్సవం

■ భారీగా తరలివచ్చిన భక్తులు

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న వేద పండితులు

ఖానాపూర్, ఫిబ్రవరి 12 : సాయిబాబా నామస్మరణతో మంగళవారం ఖానాపూర్ పులకరించింది. సాయిబాబా 27వ ఆలయ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాలతో పాటు ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యతో బాబాను దర్శించుకునేందుకు భక్తులు తరలి వచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు రామకృష్ణ శర్మ బృందం ప్రత్యేక పూజాలతో పాటు బాబా మూల విగ్రహానికి కుంభాభిషేకం చేశారు. ఉత్సవాలకు పలువురు అవదూత్ స్వాములు, గురువులు ఖానాపూర్‌కు తరలి వచ్చారు. వారం రోజుల పాటు ఆలయ ప్రాంగణంలో నిత్యం 200ల మంది భక్తులతో సాయిబాబా పారాయణాన్ని నిర్వహించారు. తెలంగాణ జానపద కళా సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు చింతామని శ్రీనివాసకృష్ణ ఆధ్వర్యంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆలరించాయి. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహాఅన్నదానం చేశారు. పెంబి పీహెచ్‌సీ అధ్వర్యంలో భక్తుల కోసం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కిలోమీటర్ల పొడవునా వెలిసిన స్టాల్స్ కనిపించాయి. జాతరకు వచ్చిపోయే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా, సీఐ మోహన్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అంకం రాజేందర్, కార్యదర్శి కొక్కుల ప్రదీప్, సభ్యులు ద్యావతి రాజేశ్వర్, కట్కం శంకరయ్య, గంటశాల గంగాధర్, కౌన్సిలర్లు, భక్త బృందం, ప్రజాప్రతినిధులు పర్యవేక్షించారు.

జాతరలో పాల్గొన్న వేలాది మంది భక్తులు

ఘనంగా మార్కండేయ జయంతి

దస్తురాబాద్, ఫిబ్రవరి 12 : మండల కేంద్రంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఆకొండపేట గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో సోమవారం మార్కండేయ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పూల మాల వేసి, ప్రత్యేక పూజలు చేశారు. పద్మశాలీ సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెంబిలో..

పెంబి, ఫిబ్రవరి 12 : మండల కేంద్రంలోని పద్మశాలీ సంఘం భవనంలో మార్కండేయ జయంతిని నిర్వహించారు. పద్మశాలీ యువకులు 21 రోజులు పాటు మార్కండేయ మాల ధరించి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం మాల విరమణ చేసి ప్రత్యేక పూజలు నిర్వంచారు. ఆనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పద్మశాలీ సంఘం అధ్యక్షుడు చింతకింది రాజన్న, సభ్యులు తులాల రాజలింగు, కంఠం సదానందం, జోగు రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌లో..

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 12 : శాంతినగర్, ఆదర్శనగర్, బంగల్‌పేట్, బాగులవాడ సంఘ భవనాల్లో మార్కండేయ మహర్షి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రత్యేక పూజలు

ఖానాపూర్, ఫిబ్రవరి 12 : పద్మశాలీ సంఘం నాయకులు ఖానాపూర్‌లోని భక్త మార్కండేయ ఈశ్వరాయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నాయకులు మార్కండేయ జయంతి ప్రముఖ్యతను వివరించారు. పట్టణ పద్మశాలీ సంఘం సభ్యులు అల్వాల శ్రీనివాస్, బిల్లా శంకర్, గంగరాజం, రాజన్న, నర్సయ్య పాల్గొన్నారు.

పెంబి : మార్కండేయ జయంతిని నిర్వహిస్తున్న భక్తులు

దస్తురాబాద్ : ఆకొండపేట లో పూజలు చేస్తున్న గ్రామస్తులు

కల్లూర్‌లో..

కుంటాల, ఫిబ్రవరి 12 : కల్లూర్‌లో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ జయంతి నిర్వహించారు. అధ్యక్షుడు గంగాధర్, గౌరవ అధ్యక్షుడు భోగ నారాయ ణ, సాయిరాం, శివ కుమార్, ప్రసాద్, శ్రీని వాస్, గంగాధర్, భరత్‌భూషణ్, తదితరులున్నారు.

ముధోల్‌లో..

ముధోల్, ఫిబ్రవరి 12 : మండల కేంద్రంతో పాటు చించాల గ్రామంలో పద్మశాలీ సంఘ ఆధ్వర్యంలో మార్కండేయ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సభ్యులు సత్యనారాయణ, నర్సయ్య, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత చదువుల కోసం వెళ్లి..

ప్రత్యూష(ఫైల్)

దిలావర్‌పూర్ ఫిబ్రవరి 12 : ఉన్నత చదువులు చదుకునేందుకు వెళ్లిన యువతి హైదరాబాద్‌లోని మాదాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని బన్సపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సత్యం సక్కారాం లక్ష్మి కూతురు ప్రత్యూష (21) బీఎస్సీ న్యూట్రీషన్ చదువుకుంది. హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తుండేది. ఈ క్రమంలో ఉద్యోగానికి లీవ్ పెట్టి ఉన్నత ఉద్యోగం సాధించేందుకు పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నది. ఈ నేపథ్యంలో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మాదాపూర్ వద్ద అదుపు తప్పి కింద పడడంతో తలకు తీవ్రగాయాలై ప్రత్యూష అక్కడిక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ఘన సన్మానం

తానూర్, ఫిబ్రవరి 12 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మాజీ సర్పంచ్ తాడేవార్ విఠల్, విద్యా కమిటీ చైర్మన్ చెన్నెమ్మను హెచ్ఎం తాలోడ్ సాయిబాబు, పాఠశాల సిబ్బంది సన్మానించారు. ఉపాధ్యాయులు, నరేంద్రకుమార్, మాధవ్, సంజయ్‌కుమార్, రమేశ్, చిన్నన్న, రవీందర్, సంజు, లచ్చారాం, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సత్కారం

ముధోల్, ఫిబ్రవరి 12 : ఎంపీడీవోగా పనిచేసి నిజామాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో సురేశ్‌బాబును స్థానిక కాంగ్రెస్ నాయకులు, సిబ్బంది సన్మానించారు. అజీజ్, ప్రేమ్‌నాథ్ రెడ్డి తదితరులున్నారు.

కోతి దాడిలో గాయాలు

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 12 : నిర్మల్‌లోని రాంనగర్ కాలనీకి చెందిన ఓ వృద్ధురాలిపై సోమవారం కోతులు దాడి చేశాయి. ఇంటి పరిసరాల్లో పని చేసుకుంటుండగా కోతి దాడి చేయడంతో ఒక్కసారిగా మెట్ల నుంచి వృద్ధురాలు పడిపోయింది. ఆమెను స్థానికులు దవాఖానకు తీసుకెళ్లారు.

గృహ హింసపై అవగాహన

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 12 : సెంటర్‌ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం బోరిగాం గ్రామంలో గృహ హింసపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ భార్య, భర్తల మధ్య వివాదాలను శాంతి యుతంగా, స్నేహపూర్వకంగా పరిష్కరించుకోవాలని సూచించారు. సీఏ గంగాధర్, మహిళలు పాల్గొన్నారు.

ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 12 : మండలంలోని వడ్యాల్ గ్రామం లోని మార్కండేయ ఆలయంలో సోమవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. పద్మశాలీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

ముధోల్, ఫిబ్రవరి 12 : ఎడ్‌బిడ్ గ్రామంలో గల మల్లన్న ఆలయానికి నూకల ఊపేందర్ జ్ఞాపకార్థం ఆయన భార్య కవిత ఆలయానికి రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. దీంతో ఆలయం వద్ద ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ చేసినట్లు కమిటీ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. మాజీ సర్పంచ్ దత్తు, రవీందర్ రెడ్డి, గంగారెడ్డి, మాణిక్‌రెడ్డి, నమ్మ పోతన్న, తదితరులున్నారు.

రూరల్ సీఐగా బాధ్యతలు స్వీకరణ

భైంసాటౌన్, ఫిబ్రవరి, 12: రూరల్ పోలీస్‌స్టేషన్ నూతన సీఐగా ఎం శ్రీనివాస్ భైంసారూరల్ పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఇక్కడ పనిచేసిన సీఐ నైలు ఐజీ కార్యాల యానికి అటాచ్డ్ నిమిత్తం వెళ్లారు. నూతన సీఐకి ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బంది స్వాగతం పలికారు.

చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ

భైంసా, ఫిబ్రవరి 12 : పట్టణంలోని మేధాహైస్కూల్ విద్యార్థిని చిత్రలేఖనం పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ చూపి రెండో బహుమతి పొందారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం సాయినాథ్ మాట్లాడుతూ తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ సైన్స్‌డేలో 9వ తరగతి విద్యార్థి అనుష్క రెండో బహుమతి గెలుచుకుందన్నారు. ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి, జిల్లా విద్యాధికారి రవీందర్‌రెడ్డి అభినందించారు. పుండలిక్‌రావు తదితరులున్నారు.

విద్యార్థికి సాయం

సోన్, ఫిబ్రవరి 12 : సోన్ మండలం కడ్తాల్ జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని నిఖిత జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. ఈ పోటీల్లో పాల్గొనడానికి విద్యార్థినికి గ్రామ మాజీ సర్పంచ్ బర్మ లక్ష్మీరాజనర్సయ్య రూ. 5వేలు, గ్రామానికి చెందిన మనుబోలు మదన్ రూ.2వేలు సాయం అందజేశారు. హెచ్ఎం వెంకటేశ్, పీఈటీ మంగ్లారపు వెన్నెల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువత ఆదర్శంగా నిలవాలి

లైసెన్స్‌లు అందిస్తున్న జిల్లా ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 12 : యువత ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలవాలని జిల్లా ఎస్పీ జానకీ షర్మిల పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో కమ్యూనిటీ పోలీస్‌లో భాగంగా పోలీసు శాఖ ముందుండి ఎలాంటి అదనపు రుసుం లేకుండా ప్రభుత్వానికి చెల్లించే చలాన్ డబ్బులతో 27 మంది మారుమూల ప్రాంతాల్లోని గిరిజన యువకులకు డ్రైవింగ్ లైసెన్స్‌లను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా వాహనం నడిపి ప్రమాదాలకు గురి కావద్దని హెచ్చరించారు. వాహనాలను డ్రైవింగ్ చేసే వారికి లైసెన్స్ తప్పనిసరి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ గంగారెడ్డి, సీఐ శ్రీనివాస్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం

దస్తురాబాద్, ఫిబ్రవరి 12 : ఉద్యోగులు, అధికారులకు బదిలీలు సహజమని ఎంపీపీ సింగరి కిషన్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో విజయ్ భాస్కర్ రెడ్డిని ప్రజాప్రతినిధులు, అధికారులు సన్మానించారు. ఎంపీటీసీ వెడ్మ మాన్కు,వైస్ ఎంపీపీ భూక్యా రాజు నాయక్, ఎంపీవో అనిల్ కుమార్, గోపాల్ కిషన్, ఏపీవో రవి ప్రసాద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ముడికే ఐలయ్య యాదవ్, నాయకులు సంతపూరి శ్రీనివాస్, ప్రజ్యోత్, బొమ్మెన గోపి, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

మాట్లాడుతున్న దేవేందర్ నాయక్

కడెం, ఫిబ్రవరి 12 : చేపల వృత్తి ద్వారా జీవనం సాగించే మహిళలు ఈడీఐఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఈడీఐఐ కడెం, ఖానాపూర్ మండలాల శిక్షకుడు దేవేందర్‌నాయక్ అన్నారు. సోమవారం కడెంలోని రైతు వేదికలో మహిళలకు శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా మహిళలు వలలు అల్లడం, చేపల కంపోస్ట్ తయారు చేసి ద్వారా ఉపాధి పొందడం, ఎండు చేపల విక్రయం వంటి వాటిపై శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి కడెంలో నెల రోజుల పాటు శిక్షణ అందిస్తారని తెలిపారు. ఎఫ్ఏ ప్రభాకర్, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

కడెం ఇన్‌చార్జి ఎంపీవోగా రత్నాకర్‌రావు

కడెం, ఫిబ్రవరి 12 : కడెం మండల ఇన్‌చార్జి ఎంపీవోగా చిక్యాల రత్నాకర్‌రావుకు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయనకు ఇన్‌చార్జి ఎంపీవోగా బాధ్యతలను అప్పగించారు. పెంబి రెగ్యులర్ ఎంపీవోగా విధులు నిర్వర్తిస్తున్న రత్నాకర్‌రావు కడెం అదనపు ఎంపీవోగా పని చేస్తారని పేర్కొన్నారు. అలాగే ఎంపీడీవో వెంకటేశ్వర్లు సైతం బదిలీపై వెళ్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు నిజామాబాద్ జిల్లాకు బదిలీ అయినట్లు వెల్లడించారు.

హత్య కేసులో జీవిత ఖైదు

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 12 : హత్య కేసులో నిందితుడికి జీవిత కారాగార శిక్షతో పాటు జరిమానా విధించారు. జిల్లా కోర్టుల సమన్వయ అధికారి సక్రియా నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మేరకు నిర్మల్ రూరల్ మండలం ముజ్గి గ్రామానికి చెందిన వేల్పుల శివకుమార్ తన మేనమామ నిర్మల్‌లోని రామారావు బాగ్‌కు చెందిన గంగమణి గోపి (45)కి డబ్బులు ఇచ్చాడు. గల్ఫ్ వెళ్లేందుకు శివకుమార్‌కు వీసా వచ్చింది. డబ్బులు అడిగేందుకు శివకుమార్ జూన్ 1, 2019లో గోపి వద్దకు వెళ్లాడు. గల్ఫ్‌కు వెళ్తున్నానని డబ్బులు ఇవ్వాలని అడిగాడు. గోపి డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించి ఇంట్లోకి తీసుకెళ్లి కొట్టి గొంతు నులిమాడు. చికిత్స కోసం దవాఖానకు తీసుకువెళ్లగా అప్పటికే శివకుమార్ మృతి చెందాడు. పెద్దనాన్న సాయన్న నిర్మల్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ డీ పద్మ గోపిపై కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ లు డీఏ జాన్ దివాకర్, ఎన్ శ్రీనివాస్ విచారణ చేపట్టారు. గోపిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వినోద్‌రావు సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టారు. నేరం రుజువు కావడంతో సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ కర్ణకు మార్ నిందితుడు గోపికి జీవిత కారాగార శిక్షతో పాటు రూ. 1000 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

బీమా చెక్కు అందజేత

కుంటాల, ఫిబ్రవరి 12 : కుంటాల మండలం అంబకంటి గ్రామంలో యువరైతు సోర్మోర్ మహేందర్ (30) గతంలో పిడుగు పాటుతో మృతి చెందాడు. భార్య కవితకు రూ.2,50,000 చెక్కును అందజేసినట్లు మన గ్రోమోర్ ఏరియా మేనేజర్ టీ రాజేందర్ తెలిపారు. మార్కెటింగ్ మేనేజర్ శ్రీశైలం, ఇన్సూరెన్స్ రిలేటివ్ అధికారి భీంరావు పాటిల్, మన గ్రోమోర్ కల్లూరు శాఖ మేనేజర్ రమేశ్, రైతులు రమేష్, ముత్యం, విఠల్, చందు, రవీందర్, రైతులు పాల్గొన్నారు.

కస్తూర్బా కళాశాల సందర్శన

విద్యార్థుల ప్రాక్టికల్ పరీక్షలను పరిశీలిస్తున్న డీఐఈవో పరుశురాం

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 12 : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ కళాశాలను సోమవారం డీఐఈవో పరుశరాం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన జంతుశాస్త్ర ప్రయోగాశాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధ్యాపకు డు రవికిరణ్, ప్రత్యేకాధికారి నవిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో అధికారులు

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 12 : విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆర్జేడీ సత్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్మల్‌లోని జేవీఎన్ఆర్ పాఠశాలలో జిల్లా స్థాయి పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆర్జేడీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే సైన్స్‌పై మక్కువ పెంచుకుని అనేక సమస్యలకు పరిష్కారాలు కనుక్కోవాలని సూచించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందించారు. డీఈవో రవీందర్‌రెడ్డి, జిల్లా పరీక్షల విభాగం సహాయ కమిషనర్ సిద్ద పద్మ, సైన్స్ అధికారి కే వినోద్‌కుమార్, డీసీఈబీ అసిస్టెంట్ కార్యదర్శి భానుమూర్తి, సెక్టోరియల్ అధికారి నర్సయ్య, నారాయణ వర్మ, బచ్చు శ్రీనివాస్, రవి కాంత్, పోతన్న, నాగరాజు, మనోహర్ రెడ్డి, రఫీక్, సత్తన్న, సుదర్శన్, అహ్మద్, విశ్వనాథ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియను ప్రారంభించాలి

దస్తురాబాద్, ఫిబ్రవరి 12 : పూర్తి స్థాయిలో ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్యా రాజేశ్ నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. హెచ్ఎం శ్రీనివాస్, జిల్లా నాయకులు చందు నాయక్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మోసం చేస్తుంది..

ఖానాపూర్ రూరల్, ఫిబ్రవరి 12 : తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ మోసం చేస్తుందని చాలా జాగ్రత్తగా ఉండాలని ఎంసీపీఐయూ పార్టీ నిర్మల్ జిల్లా కార్యదర్శి అల్లెపు పీటర్ పేర్కొన్నారు. ఖానాపూర్ మండలం గోసంపల్లిలో విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కారు ఆరు గ్యారంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో 70 శాతం ఉన్న బీసీలకు 8000 కోట్లను కేటాయించడం పెద్ద మోసమన్నారు. సహాయ కార్యదర్శి భూక్యా సురేందర్, స్వరుప గణేశ్ పాల్గొన్నారు.

కామన్వెల్త్ చెస్ చాంపియన్‌షిప్‌కు ఎంపిక

అరుణ్‌కుమార్

నర్సాపూర్(జీ), ఫిబ్రవరి 12 : మండల కేంద్రానికి చెందిన గాడి అరుణ్ కుమార్ అంతర్జాతీయ కామన్వెల్త్ చెస్ చాంపియన్ షిప్‌కు ఇండియా తరపున ఆర్బిటర్‌గా ఎంపిక అయ్యారు. మలేషియాలో ఫిబ్రవరి 19 నుంచి 28 వరకు జరిగే పోటీల్లో పాల్గొంటారు. గ్రామస్తులు అభినందించారు.

చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ

చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు, మహాగాం గ్రామస్తులు

భైంసాటౌన్, ఫిబ్రవరి 12 : మండలంలోని మహాగాం గ్రామంలో సోమవారం రజక సంఘం సభ్యులు, నాయకులు చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఐలమ్మ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. మాజీ సర్పంచ్ అప్పాల రాకేశ్, ఎంపీటీసీ పోశెట్టి, బీజేపీ నాయకులు రాజేశ్ బాబు, సుంకెట పోశెట్టి, మాజీ సర్పంచ్ చిన్నన్న, లింగన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

భారత్ బంద్ జయప్రదం చేయండి

లోకేశ్వరం, ఫిబ్రవరి 12 : రైతులకు కనీస మద్దతు ధరల చట్టం చేయాలని దేశ్యాప్తంగా రైతు రుణమాఫీ అమలు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ఈ నెల 16వ తేదీన భారత్ బంద్‌కు పిలుపునిచ్చిందని, దీన్ని జయప్రదం చేయాలని జిల్లా సంఘం ప్రతినిధులు గంగాధర్, ముత్తన్న కోరారు. మండలంలోని పుస్పూర్‌లో సోమవారం పోస్టర్ విడుదల చేసి మాట్లాడారు. కనీస మద్దతు ధరల చట్టం కోసం, రుణమాఫీ, విద్యుత్ సవరణ చట్ట ఉపసంహరణ కోసం బంద్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME
I,TATIPELLY GIREESH (OLD NAME) S/O RAJESHWAR TATIPELLY R/o H:No : 11-13/1,Old Post Office Road ,Asifabad, Is Here By Declare That, Hence Change My Name As 'TATIPALLI GIRISH' (New Name) Holding Passport No.L7404085 Dt.20-02-2014 To 19-02-2024 Issued At Hyderabad, Hence Declared.

CHANGE OF NAME
★I, PENTA SINDHOORI W/o. VAMSHI KRISHNA DARAVASTU R/o. 2-83/44/D1, INDIRA NAGAR, NIRMAL, TS. HENCE FORTH SHALL BE KNOWN AS DARAVASTU SINDHOORI.
NT-paramesh goud

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677